జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 2-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 181 పేజీలు: 8 వెల : రూ.7



# మేమే.. నెంబర్ వన్



* టీడీపీ సభ్యత్వ నమోదులో దూసుకుపోతున్న పాతపట్నం నియోజకవర్గం * కేడర్‌ను దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు * అధినేత, యువనేత నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్న ఎంజీఆర్ * ప్రభుత్వ, సేవా కార్యక్రమాలతో నియోజకవర్గంలో పట్టు సాధింపు * నిన్న సామాన్యుడు... నేడు అసమాన్యుడు * పాతపట్నంలో అల్లుకుపోతున్న 'మామిడి' * 'పాత'పట్నాన్ని సరి 'కొత్త'పట్నంగా చేసేందుకు ప్రణాళికలు

పాతపట్నం, డిసెంబర్ 1(వార్త): పాతపట్నం నియోజకవర్గం భౌగోళికంగాను, రాజకీయంగాను రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, లక్ష్మీనర్సుపేట మండలాలతో ఉంది. గిరిజనులు, పేద, మధ్య తరగతి జనాభాతో వలసలతో కూడిన నియోజకవర్గం అయినప్పటికీ రాజకీయంగా ఇక్కడి ప్రజలు అత్యంత చైతన్యవంతులు. లుకలాపు లక్ష్మణ దాస్, పోతల గున్నయ్య, కలమట మోహన రావు, నందమూరి లక్ష్మీ పార్వతి లాంటి పేరుమోసిన రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన నాయకులు ఎమ్మెల్యేలుగా పని చేసిన నియోజకవర్గం. నేడు ఒక సామాన్య నిరుపేద రైతు కూలీ కుటుంబం నుంచి వచ్చిన మామిడి గోవిందరావును అభిమానులు ముద్దుగా పిలుచుకునే పేరు ఎంజీఆర్. పాతపట్నం నియోజకవర్గంలో ఎవ్వరికీ సాధ్యం కానీ తిరుగులేని మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించారు.

## సభ్యత్వ నమోదులో దూసుకుపోతున్న ఎంజీఆర్

తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం దూసుకుపోతుంది. ఆదివారం నాటికి 46,809 నూతన సభ్యత్వం, రెన్యూవల్స్‌తో శ్రీకాకుళం జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంది. అలాగే జోన్1లో పాతపట్నం నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో ఉండేలా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సభ్యత్వ నమోదు వంద శాతం జరిగేలా చూస్తున్నారు. దీంతో కేడర్ సైతం ఉత్సాహంగా సభ్యత్వ నమోదులో పాల్పంచుకుంటున్నారు.

## నిన్న సామాన్యుడు... నేడు అసమాన్యుడు...



సాధారణ రైతు కుటుంబంలో పుట్టి వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదుగుతూ కోట్లాది రూపాయలతో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుని ఒక సామాన్యుడు శాసనసభలో అడుగుపెట్టి మనిషి తలుచుకుంటే దేన్నైనా సాధించగలడని నిరూపించిన అసమాన్యుడు మామిడి గోవిందరావు.

## అధినేత, యువనేత నమ్మకాన్ని నిలబెట్టిన ఎంజీఆర్...

పాతపట్నం నియోజకవర్గంలో సుదీర్ఘంగా బలమైన రాజకీయ చరిత్ర కలిగి, నాలుగు దశాబ్దాలుగా సన్నిహిత సంబంధం కలిగిన కలమట కుటుంబానికి కాదని తెలుగుదేశం పార్టీ టికెట్‌ను ఎంజీఆర్‌కు పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ బాబు ఇచ్చారు. తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అందరినీ సమన్వయం పరుచుకుని పాతపట్నం చరిత్రలో ఇంత వరకు ఎవరూ సాధించలేని సుమారు 28,000 వేలు ఓట్లు మెజారిటీతో మామిడి గోవిందరావు గెలిచారు. అధినేత, యువనేత తనపై ఉంచిన నమ్మకాన్ని ఎంజీఆర్ నిలబెట్టుకున్నారు.

## నియోజకవర్గంలో పట్టు సాధిస్తున్న మామిడి...

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నేటికీ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. తన సొంత డబ్బులను ఉపయోగిస్తూ నిత్యం ప్రజలతో మమేకమవుతూ ఎమ్మెల్యేగా తనకు వచ్చిన అలవెన్స్‌లు కూడా ప్రజల సేవలకు ఖర్చు చేస్తూ నియోజకవర్గంలో రోజురోజుకు పట్టును పెంచుకుంటున్నారు.

## 'పాత'పట్నంను సరి కొత్త పట్నంగా మార్చేందుకు ప్రణాళికలు..



పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధి లేక పేదరికం ఉపాధి లేక వలసలు కలిగి వెనుకకు నెట్టేయబడిన నియోజకవర్గంను అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పాతపట్నంను కొత్త పట్నంగా తీర్చిదిద్ది తనదైన ముద్ర వేసుకోవాలనే ఉద్దేశంతో అన్ని చర్యలు తీసుకుంటున్నారు. గిరిజన జనాభా అధికంగా ఉండడం వల్ల నియోజకవర్గంలో ఐటీడీఏ, ఏపిఐఐసి ద్వారా ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి కల్పన, పాతపట్నంలో ఫైర్ స్టేషన్, 100 పడకల ఆసుపత్రి, ఎల్ఎన్‌పేటలో పోలీస్ స్టేషన్, కొత్తూరులో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శీతల గిడ్డంగి, డిగ్రీ కాలేజీ, నిర్వాసితుల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం తరచూ ముఖ్యమంత్రి తోపాటు సంబంధిత మంత్రులను కలిసి ప్రపోజల్స్ చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో కోట్లాది రూపాయలతో గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలతో అభివృద్ధి పథంలోని నియోజకవర్గాన్ని ముందుకుతీసుకువెళు తున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విభిన్నప్రతిభావంతులకు రేపు ఉపకరణాల పంపిణీ



శ్రీకాకుళం, డిసెంబర్ 1(వార్త): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఈ నెల 3న శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహింస్తామని ఆ శాఖ అధికారిణి కవిత తెలిపారు. ఆదివారం ఆమె విలేఖరులతో మాట్లా డారు. నవంబర్ 20న డచ్ భవన మైదానము, డి.ఆర్.డి.ఎ కాంప్లెక్స్ ఎదురుగా జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆ రోజు బహుమతుల ప్రదానం చేస్తామన్నారు.

జిల్లాలోని విభిన్నప్రతిభావంతులందరూ ఆ వేడుకలకు హాజరు కావాలని ఆమె కోరారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు



**పలాస, డిసెంబర్ 1(వార్త):** పలాసలోని గోపీచంద్ రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీలను స్కేటింగ్ సంఘ కార్యదర్శి పి.విఠల్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో జి.శ్రీనివాస్, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్కేటింగ్ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారాలు అందిస్తామన్నారు. విఠల్ మాట్లాడుతూ విజేతలను ఈ నెల 28, 29 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. కళ్యాణ్చక్రవర్తి మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వం ఏర్పడుతుందన్నారు.

ఈ పోటీల్లో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజే తలకు పతకాలతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో క్లబ్ కోచ్ బి.చంద్రావతి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## విప్ అశోక్‌కు ఘన సన్మానం

సోంపేట, డిసెంబర్ 1(వార్త): పొత్రఖండ గ్రామంలో తొలిసారి పర్యటించిన ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్‌ను ఆ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, మండల నాయకులు మద్దిల నాగేశ్వరరావు, రత్నాల వెంకటరమణ, కూటమి నేతలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఎర్రముక్కాం విద్యార్థినికి ప్రథమ బహుమతి



సోంపేట, డిసెంబర్ 1(వార్త): ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్ పరీక్షలో ఎర్రముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని జుత్తు తిరుమల విజేతగా నిలిచింది. ఆమెకు రూ.3016 బహుమతితో పాటు షీల్డ్, సర్టిఫికెట్ అందజేసినట్లు హెచ్ఎం అనంతరావు తెలిపారు. విజేతలకు, మంచి తర్ఫీదు నిస్తున్న ఉపాధ్యాయులందరికీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుమతిని సమకూర్చిన రమేష్ పాణిగ్రాహి మాస్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయినులు మాధవి బెహరా, కృష్ణవేణి, సత్యవతి, పీఆర్టీయూ సోంపేట, కంచిలి మండల శాఖల సభ్యులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అప్రమత్తం



పోలాకి,డిసెంబర్ 1(వార్త): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గంగివలసలోని కేజీబీవీ పాఠశాలలో ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ ఎన్.రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. రెడ్ రిబ్బన్, హెచ్ఐవీ వైరస్ ఆకృతిలో విద్యార్థులను కూర్చొబెట్టి ఏఆర్టీ థెరపీ ద్వారా రోగిలో కలిగే మార్పులను ప్రత్యక్షంగా వివరించారు.

కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ శారద, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మంగం శేఖర్‌బాబు, విజయ్, పూర్ణ, అధ్యాపక సిబ్బంది పీఈటీ తదితరులు పాల్గొన్నారు.



## సంగమేశ్వరునికి పూజలు



వంగర, డిసెంబర్ 1(వార్త): సంగాంలోని శివాలయంలో ఆదివారం శివునికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ పూజలను ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావు, సహ అర్చకులు సిద్ధాంతం చిన్నబాబు, సిద్ధాంతం రమేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులు త్రివేణి సంగమంలో స్నానాలాచరించి, శివుడిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోను ఆనందరావు, ఆలయ ఈవో శ్యామల రావు తదితరులు పాల్గొన్నారు.

## చిరుజల్లులతో అవస్థలు



వంగర, డిసెంబర్ 1(వార్త): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా వంగర మండల పరిధిలో చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో అటు రైతులకు, ఇటు వ్యాపారవర్గాలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రైతన్నలు వరి పంటను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు.పంట చేతికి వచ్చే సమయంలో వరుణదేవుడు కన్నెర్ర చేయడంతో అవస్థలు తప్పడం లేదని వారు వాపోతున్నారు. ఇదిలా ఉంటే వ్యాపారాలు జరగక వ్యాపారులు ఉసూరుమంటున్నారు.

వరుణదేవుడు కరు ణిస్తే తమ కష్టాలు తీరిపోతాయని రైతులు, వ్యాపారస్తులు అంటున్నారు.

## ఆకట్టుకున్న కోలాటం

ఇచ్ఛాపురం, డిసెంబర్ 1(వార్త): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో టి.బరంపురానికి చెందిన తిప్పన ధనంజయ రెడ్డి కోలాట శిష్యబృందం ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి తిరువీధి సందర్భంగా అసిరమ్మ తల్లి కోలాట బృందం అత్యద్భుత ప్రదర్శన చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో లోపింటి శంకర్, గేదెల పరశురాం, చిల్ల ధర్మరాజు, కోలాటం బృందం తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి నివారణకు విస్తృత తనిఖీలు



నరసన్నపేట, డిసెంబర్ 1(వార్త): నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. జాగిలాల సహాయంతో బస్సుల్లో, కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలను ముమ్మరంగా పరిశీలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై ఉక్కు పాదం మోపుతామన్నారు. ఎక్కడ గంజాయి అమ్మకాలు, రవాణా జరిగినా తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు

**పోలాకి:** పోలాకి బజార్ జంక్షన్లో గంజాయి పట్టుకునేందుకు పోలాకి పోలీసులు కెనైన్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలాకి ప్రధాన రహదారిలో అన్ని దుకాణాలను పరిశీలించారు. వాహనాలను కూడా తనిఖీ చేశారు.



## విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న ముళ్ల తీగలు

(జలుమూరు)

నరసన్నపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీస్ రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు ముళ్లకంపలు అల్లుకున్నాయి. కనీసం వీటి ఆలనా పాలనా చూసే అధికారులు లేరనే విమర్శలు వస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యుత్ స్తంభాలకు మరింతగా ఇవి అల్లుకుపోయి విద్యుత్ అంతరాయానికి ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొంటాయని స్థానికులు తెలిపారు.





## ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి

ఇచ్ఛాపురం, డిసెంబర్ 1(వార్త): దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించాలని రాష్ట్ర మఠ్‌మందిర్ ప్రముఖ్ ఫల్గుణరావు కోరారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ ముందస్తు సన్నాహక సమావేశం ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రఖండ అధ్యక్షుడు పాకా తులసీదాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఫల్గుణరావు మాట్లాడుతూ దేవాలయాలపైన అన్యమతస్థుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. హైందవ శంఖారావానికి పెద్ద ఎత్తున హిందువులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రామ్ ప్రసాద్ మాస్టర్, ముప్పన గవరయ్య, వీకే ప్రసాద్, అయ్యప్ప, శివ స్వాములు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

## ఆదిత్యుడికి రూ.3.03లక్షల ఆదాయం

అరసవల్లి, డిసెంబర్ 1(వార్త):అరసవల్లి సూర్యనారాయణస్వామివారిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. ఈ సందర్భంగా టికెట్లు రూపేణా రూ.66వేలు, పూజలు, విరాళాల రూపంలో రూ.38,938లు, ప్రసాదాల రూపంలో రూ.1,98,135లు స్వామి వారికి ఆదాయం వచ్చిందని చెప్పారు.

## మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన ఈశ్వరరావు



పలాస, డిసెంబర్ 1(వార్త): రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు..ఆదివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి ఇప్పించినం దుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టబడి పనిచేసినవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభు త్వం అందించిన బాధ్యతలను సక్ర మంగా నిర్వర్తించి, మంచి పేరు ప్రఖ్యా తులు సంపాదించాలని ఆకాంక్షించా రు. అంతకుముందు మంత్రి, ఎమ్మెల్యే ను ఆయన దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాలనందించారు. నౌపడా -పూండి వయా వెంకటాపురం రోడ్డు ను విస్తరించాలని వారిని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సూరాడ మోహనరావు, ప్రధాన కార్య దర్శి కర్ని రమణ, గోవిందు పాపా రావు, దున్న షణ్ముఖరావు, మదనాల జోగారావు, సత్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సహకారం రంగంలో
## అవినీతిపై విచారణ చేయండి
### అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కూన రవికుమార్

బూర్జ, డిసెంబర్ 1 (వార్త): బూర్జ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. సహకార సంఘంలో అవినీతి, ధాన్యం కొనుగోలు విషయాన్ని పలువురు సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్యే రవికుమార్ స్పందిస్తూ పూర్తిస్థాయిలో సహకార సంఘంపై సమగ్ర విచారణ జరిపించేలా తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్‌లో సాగు చేసే రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయించాలన్నారు. మండలంలో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే పీడీ యాక్ట్‌ను ప్రయోగించాలన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణం నాయుడు, జడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, ఎంపీడీవో తిరుపతిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఉదారత చాటుకున్న ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం, డిసెంబర్ 1(వార్త): ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మరో సారి తన ఉదారతను చాటుకున్నారు. రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి లోకేష్ పిలుపుమేరకు ఈనెల 7న తల్లితండ్రులు- ఉపాధ్యాయుల సమావేశం అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

దీంతో ఎమ్మెల్యే.. పాతపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సమావేశం నిర్వహ ణకు అయ్యే ఖర్చుల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీ తంగా ఈ సమావేశా లను పండగ వాతావరణంలో జరపడం రాష్ట్ర విద్యావ్యవస్థలోనే నూతన సువర్ణాధ్యాయమని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం సనపల వైకుంఠరావు, ఎస్ఐ బి.లావణ్య, జవ్వాది ఈశ్వరరావు, జవ్వాది సవరయ్య, కణితి లక్ష్మీనారాయణ, మన్మథ, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నేవీ డే సెలెబ్రేషన్స్



శ్రీకాకుళం, డిసెంబర్ 1(వార్త):శ్రీకాకుళం జిల్లా నేవీ డే సెలెబ్రేషన్స్ ఆదివారం కుశాలపురం సమీపంలోని సెలబ్రేషన్స్ రిసార్ట్స్‌లో ఘనంగా నిర్వహించామని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు తెలిపారు. నావల్ సీనియర్, జూనియర్ వెటరన్స్‌తో కేక్ కటింగ్ చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. సుమారు ఒక 50 మంది సిక్కోలు నావికాదళ అనుభవజ్ఞులు నేవీలో గోల్డెన్ డేస్‌ను గుర్తుచేసుకున్నారు. భారత సాయుధ దళాలలో చేరేలా మెలగా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పైడి నాగేశ్వరరావు, బమ్మిడి పురుషోత్తం, పైడి తవిటయ్య, గోవిందరాజులు, సనపల అన్నంనాయుడు, పైడి విశ్వేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పైడి వేణు, పైడి భాస్కర్‌రావు, జి.శ్రీనివాసరావు, ఎమ్.అప్పల రాజు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, రమేష్, నావల్ వెటరన్స్ పాల్గొన్నారు.

# టెక్కలిలో డ్రగ్ ట్రేడ్ సంఘం వనభోజన సందడి



టెక్కలి, డిసెంబర్ 1(వార్త): టెక్కలి మండలంలో తేలినీలాపురం గ్రామం పక్షుల విహార కేంద్రంలో ఆదివారం టెక్కలి డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సందడిగా వనభోజన మహోత్సవం జరిగింది.

కార్యక్రమానికి జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ గౌరవ అధ్య క్షుడు శిష్టు జగం అధ్యక్షత వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఔషధ దుకాణ నిర్వహణలో ఎటువంటి సమస్యలు వచ్చినా అసోసియేషన్ ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఔషధ చట్టాన్ని అనుసరించి మందులు విక్రయించాలని ఆయన తెలిపారు. పోటీతత్వంలో ఎటువంటి ఈర్ష్య భావాలు లేకుండా వ్యాపారాలు జరపాలని హోల్ సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్ సోదరులను ఆయన కోరారు. పలు సమస్యలపై చర్చించి, సలహాలు సూచనలు ఇచ్చారు. టెక్కలి డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రెసిడెంట్‌గా శ్రీఏజెన్సీ ప్రొప్రయిటర్ శిష్టు జగం, కార్యదర్శిగా బర్ల మెడికల్ ప్రొప్రయిటర్ బర్ల తవిటయ్య, కోశాధికారిగా అన్నపూర్ణ మెడికల్ ప్రొప్రయిటర్ బొరిగి బాలకృష్ణ (బాల)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్లు ఆట్ల వెంకటేశ్వర రావు, పాండవ సంతోష్, టెక్కలి, నౌపడ, పూండి, పాతటెక్కలి, పొల్లాడ, అల్తాడా, దండుగోపాలపురం, నదిగాం, తామరపల్లి, కొత్తపేట తదితర పరిసర గ్రామ ఔషధ దుకాణ యజమానులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆదిత్యుడిని దర్శించిన మండలి విప్

**అరసవల్లి, డిసెంబర్ 1(వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని ఆదివారం శాసనమండలి విప్ డాక్టర్‌వేపాడ చిరంజీవిరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వీరికి స్వామివారి ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశామని ఆలయ ఈవో యర్రం శెట్టి భద్రాజీ తెలిపారు.



# ప్రజా వేదికకు వినతుల వెల్లువ

**టెక్కలి, డిసెంబర్ 1(వార్త):** నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజా వేదికకు వినతులు వెల్లువెత్తాయి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జనవరి నుంచి నూతన పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. నూతన ఇళ్లు, జనవరిలో కొత్త పింఛన్లు మంజూరుకు అర్హులంతా అధికారులు తమ గ్రామాల్లో పర్యటించినప్పుడు వివరాలు అందజేయాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామానికి అధికారులు వచ్చి యాప్‌లో వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు వినతులు అందజేశారు. పింఛన్లు, గృహాల కోసం, డ్రైన్లు, రోడ్ల నిర్మాణం కోసం వినతులు పెద్ద ఎత్తున అందాయి.



కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం, మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



**శ్రీకాకుళం, డిసెంబర్ 1(వార్త):** ఎయిడ్స్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా.బి.మీనాక్షి అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఏడు రోడ్ల కూడలి వరకు సాగింది. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారితో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారికి భయాందోళన అవసరం లేదని, మనో నిబ్బరంతో ఉండాలని, మంచి ఆహారం తీసుకోవడంతో పాటు వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తారన్నారు.

ఈ ర్యాలీలో మంత్రి వెంకటస్వామి, ప్రసాద రావు, మణికంఠ, కళింగ రమణ, డా. పోలినాయుడు, కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ యూత్ రెడ్ క్రాస్ వలంటీర్స్, మేనే జింగ్ కమిటీ బి.చిన్మయిరావు, నర్సింగ్ రావు, ప్రోగ్రాంమేనేజర్ గొలివి రమణ, పి.సతీష్, సుజాత, ఉమాశంకర్ రెడ్ క్రాస్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

## గురజాడ రచనలు ఆచరణీయం




**శ్రీకాకుళం, డిసెంబర్ 1(వార్త):** గొప్ప కవి, అభ్యుదయ రచయిత, హేతువాది సంఘ సంస్కర్త, నవయుగ కవితా పితామహుడు గురజాడ అప్పారావు రచనలు ఈ సమాజానికి ఆచరణీయమని ప్రముఖ పాత్రికేయుడు, రచయిత నల్లి ధర్మారావు, ఉద్యోగుల ఉపాధ్యాయుల కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం తెలిపారు. శ్రీకాకుళంలోని ఎన్జీవో హోం లో గురజాడ అప్పారావు వర్ధంతి మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు గొంటి గిరిధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం నల్లి ధర్మారావు మాట్లాడుతూ గురజాడ రచించిన "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అనే దేశభక్తి గేయం నేటికీ ఆచరణీయమని తెలిపారు. హనుమంతు సాయిరాం మాట్లాడుతూ గురజాడ సంస్కరణ ఉద్యమ రచయితగా కన్యాశుల్కాన్ని వ్యతిరేకించారని, మహిళా సమస్యలపై తన రచనల ద్వారా ప్రశ్నించారన్నారు. గొంటి గిరిధర్ మాట్లాడుతూ గురజాడ.. హేతువాదిగా, అభ్యుదయవాదిగా ఆనాడే శాస్త్రీయ దృక్పథాన్ని సమాజం కలిగి ఉండాలని, సమాజాభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలని తన రచనల ద్వారా నిర్దేశించారన్నారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వీజీకే మూర్తి, ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, ఆర్‌యూపీపీ రాష్ట్ర కార్యదర్శి కె.పద్మావతి, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బలివాడ ధనుంజయ రావు, కేఎన్‌పీఎస్ జిల్లా నాయకులు మిస్కా కృష్ణయ్య, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ఎస్సీ,ఎస్టీ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పల డేనియల్, ఏపీటీఎఫ్ 257 జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్, ఏపీ బీఎస్‌బీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు తదితరులు మూఢనమ్మకాల నిరోధక చట్టం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏపీసీపీ స్ యూఎస్ జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి భాస్కరరావు, బీటీఏ జిల్లా అధ్యక్షులు సీర రమేష్, యూటీఎఫ్ జిల్లా నాయకులు బర్రి పురుషోత్తం, చెకుముకి జిల్లా కన్వీనర్ పి.కూర్మారావు, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు సామ సంజీవరావు, సైన్స్ అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ హనుమంతు మన్మథరావు, పి.నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఎం.గోవర్ధనరావు, సాంస్కృతిక విభాగం నాయకులు సీహెచ్ రామచంద్రరావు, ఎస్.శ్రీనివాసులు, సమతా నాయకులు తంగి ఎర్రమ్మ, పత్రికా విభాగం నాయకులు ఎంవీ మల్లేశ్వరరావు, కేఎన్‌పీఎస్ నాయకులు రాకోటి రాంబాబు, జేవీవీ జిల్లా కోశాధికారి వీఎస్ కుమార్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ అగతముడి వాసుదేవరావు, కల్చరల్ కమిటీ కో కన్వీనర్ పైడి రామస్వామి, ప్రజా సంఘం నాయకులు టి.తిరుపతిరావు, రామారావు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. ఎస్.శ్రీనివాసులు, సీహెచ్ రామచంద్రరావు, సామ సంజీవరావు ఆలపించిన దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ వంటి పలు అభ్యుదయ గేయాలు దేశభక్తి ప్రేరణ కల్పించాయి. మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కోసం జిల్లాలోని ప్రజాప్రతినిధులను కలసి ప్రభుత్వం మీద ఒత్తిడి చేయాలని, మూఢ విశ్వాసాల, మూఢనమ్మకాల వ్యతిరేక ప్రచారాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.


## వ్యక్తి ఆత్మహత్య



**నరసన్నపేట, డిసెంబర్ 1(వార్త):** నరసన్నపేట మండలం చిన్న బొరిగి వలనకు చెందిన గంగారావు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# అలరించిన కృష్ణవేణి సంగీత నీరాజనం

**శ్రీకాకుళం, డిసెంబర్ 1(వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి దేవస్థానంలో ఆదివారం కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం సాంస్కృతిక వైభవంతో సాగింది. కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ఈ సంగీత కార్యక్రమం ప్రతిబింబిస్తుందని, ఈ సంగీత విందును ఆస్వాదించడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రఖ్యాత కళాకారులు విదూషి మండ సుధారాణి బృందం గాత్ర కచేరి (కర్ణాటక శాస్త్రీయ సంగీతం), వయోలిన్-డాక్టర్ మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగం ఎం.శ్రీధర్, ఘటం-మావుడూరు సూర్యప్రసాద్‌రావు తదితరులు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. వాతాపి గణపతిం..ఎందరో మహాను భావులు.. వంటి కీర్తనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమాన్ని పర్యాటక మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమంలో కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ తరపున చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, అరసవల్లి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ వై.భద్రాజి, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Working Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546